క్లుప్తంగా

ముగిసిన సంతోషిమాత ఉత్సవాలు

భామిని: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు బత్తిలిలో వెలసిన సంతోషిమాత ఆలయ 37వ వార్షికోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఐదు రోజులుగా ఆలయ ప్రధాన అర్చకులు రంపా తాతబాబు శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి భక్తులు విశేష పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు కుటుంబంతో కలిసి పూర్ణాహుతి, హోమాదికాలు జరిపించారు. ఉత్సవాల సందర్భంగా ఐదు రోజులు అన్నసమారాధన చేశారు.

రూ.50వేలు విరాళం అందజేత

కొమరాడ: మండలంలోని కొట్టు గ్రామంలో శివాలయం పునర్నిర్మాణం కోసం మాదలింగి గ్రామానికి చెందిన క్వీన్స్ ఎన్ఆర్ఐ హాస్పిటల్ సీఈఓ తుమరాడ చంద్రమౌళీశ్వరావు రూ.50 వేలు విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని శనివారం మాదలింగి యూత్ సభ్యులు రాగాల సంతోష్, శిష్టు మోహనరావు, కొమ్ము వెంకటరమణ గ్రామస్తులకు అందజేశారు. ఆలయ పునర్నిర్మాణానికి దాతలు సహకరించాలని కోరారు.

7న డోలో యాత్ర

కురుపాం: ఈ నెల 7,8వ తేదీల్లో కురుపాం మండల కేంద్రంలోని శివ్వన్నపేట జగన్నాథ స్వామి ఆలయం ఆవరణలో డోలో యాత్ర మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం, బుధవారం రెండు రోజుల్లో ఉదయం నుండి రాత్రి పది గంటల వరకు ప్రత్యేక పూజలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

7 నుంచి ఆశీర్వాద పండుగలు

గుమ్మలక్ష్మీపురం: ఈనెల 7,8వ తేదీల్లో మండలంలోని చినగీసాడ గ్రామంలో నిత్యజీవ ఆశీర్వాద పండుగలు నిర్వహించనున్నట్లు విశ్వవాణి పాస్టర్ కె.భీముడు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పండుగలకు విశాఖపట్నం నుంచి రెవరెన్ పాస్టర్ ఇ.సామ్యూల్, హైదరాబాద్ నుంచి రెవరెన్ పాస్టర్ జి.గాబ్రియేల్, గుంటూరు నుంచి పాస్టర్ కె.పారయ్య నాయుడు, బొబ్బిలి నుంచి రెవరెన్ పాస్టర్ కె.జె.సునీల్ ముఖ్య అతిథులుగా పాల్గొని క్రీస్తు వ్యాక్యాన్ని బోధిస్తారన్నారు. క్రీస్తు భక్తులంతా ఈ ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

డయాలసిస్ రోగికి ఆర్థిక సాయం



కిడ్నీ బాధితుడికి ఆర్థికసాయం అందిస్తున్న అరుణ్‌కిరణ్, గ్రామపెద్దలు

భామిని: మండలంలోని బాలేరుకు చెందిన బుర్రా రమణకు రెండు కిడ్నీలు పాడవడంతో అతను మంచంపట్టాడు. కుటుంబ పోషణ కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన కళింగ వైశ్యసంఘం యూత్ కన్వీనర్ బోగి అరుణ్‌కిరణ్ తన మిత్రుల నుంచి విరాళాలు సేకరించి, ఆ మొత్తాన్ని శనివారం గ్రామ పెద్దల సమక్షంలో బాధితుడికి అందజేశారు. దాతలు ముందుకొచ్చి రమణ కుటుంబాన్ని ఆదుకోవాలని వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం చేయడంతో కొంతమంది యువత సాయం అందించినట్లు అరుణ్‌కిరణ్ తెలిపారు.

పేదలకు చీరలు పంపిణీ

పాలకొండ: పట్టణంలోని శివ జ్యోతి టైలర్స్ ఆసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పేదలకు చీరలు పంపిణీ చేశారు. టైలర్స్ డే వేడుకల్లో భాగంగా స్థానిక బాలగోపాల లక్ష్మీనరసమ్మ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు వీటిని అందజేశారు. ఆసోసియేషన్ అధ్యక్షురాలు కె.కళ్యాణి, మహిళా టైలర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

పాలకొండ రూరల్: సమున్నత లక్ష్యంతో ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని చేపడుతున్న ఉపాధిహామీ పనులను క్షేత్రస్థాయి సిబ్బంది అంకితభావంతో చేయించాలని ఎంపీడీఓ దొంక త్రినాథులు అన్నారు. పాలకొండ మండలం యరకారాయపురంలో జరుగుతున్న పనులను శనివారం తనిఖీ చేశారు. పని ప్రదేశం వద్ద ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గరిష్ట వేతనం పొందేందుకు పాటించాల్సిన నిబంధనలను వేతనదారులకు వివరించారు. అనంతరం సీఎంపురం సచివాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు.

ప్రకృతి సాగు..నేలకు బాగు

పాలకొండ రూరల్: ప్రకృతి అందించిన వనరులతో సేద్యం చేయటం వలన నేల తల్లికి మేలు చేకూరుతుందని లుంబూరు సర్పంచ్ తిర్లంగి ఉపేంద్రకుమార్ అన్నారు. గరుగుబిల్లి గ్రామంలో శనివారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఏపీ కమ్యూనిటీ మేనేజ్ ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్) ద్వారా రైతులకు అవసరమైన వివిధ రకాల విత్తనాలు, సహకారం అందించనున్నట్లు చెప్పారు. గ్రామస్థాయిలో అన్నదాతలు ప్రకృతి సేద్యం చేయటం వలన అధిక దిగుబడి, ఆరోగ్యవంతమైన ఫలసాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పడాల రామచంద్రరావు, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది ఎం.లక్ష్మునాయుడు, బి.సూరపునాయుడు, తిరుపతిరావు, గోవిందరావు పాల్గొన్నారు.

చేతిరాతతో మారనున్న గీత




పరీక్షలు రాస్తున్న విద్యార్థులు(ఫైల్)

- దస్తూరీపై విద్యార్థులు దృష్టి సారించాలి
- చేతిరాత బాగుంటే మంచి మార్కులు వచ్చే అవకాశం

గరుగుబిల్లి: పదోతరగతి పరీక్షలు సమీపిస్తున్నాయి. విద్యార్థులంతా చదువుపై ద్యాస పెట్టారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలంటే చదువుతో పాటు చక్కనిచేతిరాత కూడా ముఖ్యమే. విద్యార్థులు సమాధానాలు ఎంత బాగా రాసినా.. పేపర్ మూల్యాంకనం చేసేవారికి విద్యార్థి చేతిరాత అర్థం కాకపోతే మార్కులు తక్కువగా వచ్చే అవకాశం ఉంది. కాబట్టి విద్యార్థులు చేతిరాతపై కూడా దృష్టి సారించాలి.

సాధనతోనే సాధ్యం

పదోతరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులను విద్యార్థులు సన్నద్ధం చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ, స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ఏడాది పాటు నేర్చుకున్న అంశాలను పరీక్షలో అడిగిన ప్రశ్నలకు రెండున్నర గంటల్లో సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. సమాధానాలు రాసేటప్పుడు దస్తూరీ బాగుండటంతో పాటు ఎటువంటి కొట్టివేతలు లేకుండా రాస్తే మంచి మార్కులు వస్తాయి. సాధనతో చేతిరాతను చక్కగా మార్చుకోవచ్చు. రాయడం ప్రాక్టీస్ చేయడం ద్వారా దస్తూరీ మెరుగుపడడంతో పాటు చదివిన అంశాలు దీర్ఘకాలం గుర్తుంటాయి.



దస్తూరీ ఇలా ఉంటే మంచిది

ఇవి పాటించాలి:

- సమాధాన పత్రంలో రాసే జవాబులు సూటిగా, అక్షరాలు పొందికగా ఉంటే పేపరు దిద్దేవారు పూర్తిగా మార్కులు వేసే అవకాశం ఉంటుంది.
- పేజి పైభాగంలో ఒక అంగుళం, ఎడమవైపు అదే స్థాయిలో మార్జిన్ విడిచిపెట్టాలి.
- సామాన్య, భౌతికశాస్త్రాలలో బొమ్మలు గీసి భాగాలు గుర్తించే విషయంలో పెన్నును వత్తిపెట్టి రాయకూడదు. ఇలా చేస్తే పేపరు వెనుకభాగం పాడవుతుంది.
- పేజీలో వాక్యాలు పైనుంచి కిందకు లేదా పైకి ఉండకుండా వరుసలో ఉండాలి.
- పేజీకి పదహారు నుంచి ఇరవై లైన్లు మించి రాయకూడదు.
- రోజు కొద్దిసేపు సాధన చేస్తే పరీక్షలలో ఆందోళన లేకుండా సాఫీగా రాయవచ్చు.
- పెన్ను సక్రమంగా పట్టుకొని రాస్తే, రాసే అక్షరాలు మనకు కనిపించడంతో పాటు గుండ్రంగా ఉంటాయి.
- జవాబు రాసేటప్పుడు అట్టపైకి వాలిపోకుండా సాధ్యమైనంత వరకు కూర్చుని రాయడం మంచిది.
- అక్షరాలు, పదాలు వాక్యాలు మధ్య తగినంత ఖాళీ ఉంచాలి.

చేతిరాతతో మార్కులకు ధోకా ఉండదు



ముత్యాలాంటి అక్షరాలతో మార్కులకు ధోకా ఉండదు. చేతిరాత మెరుగు పరిచేందుకు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. సమాధానాలు దిద్దే అవకాశం లేకపోతే విద్యార్థులు నష్టపోతారు. తక్కువ రాసినా తప్పులు లేకుండా అందంగా రాయడంవల్ల ఆకట్టుకొని మార్కులు సాధించవచ్చు.
– జి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు, రావివలస

చేతిరాతకు ప్రాధాన్యతనివ్వాలి



శాస్త్రసాంకేతిక రంగం ఎంత ఎదిగినా చేతిరాతకు ప్రాధాన్యం పెరుగుతూనే ఉంటుంది. సంబంధిత భాషపై పట్టువుంటే రాయడం తేలికవుతుంది. దస్తూరి బాగున్న విద్యార్థులకు అదనపు మార్కులు పొందే అవకాశం ఉంటుంది. విద్యార్థులకు దీనిపై అవగాహన కల్పించడంతో పాటు శిక్షణ ఇస్తున్నాం.
– ఎస్.నాగభూషణరావు, ఎంఈఓ, గరుగుబిల్లి

సింహద్వారం ప్రారంభం

భామిని: లివిరి కూడలిలో నిర్మించిన సింహద్వారంను ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శనివారం ప్రారంభించారు. ముందుగా స్థానిక రాధాకృష్ణ మందిరంలో పూజలు చేశారు. అనంతరం ఆలయ పూజారుల వేదమంత్రోశ్చరణ మధ్య సింహాద్వారాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సింహాద్వారం నిర్మాణానికి నిధులు సమకూర్చిన దాతను ఈ సందర్భంగా సన్మానించారు.



సింహద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి

రాజ్యలక్ష్మీపురంలో ఫ్యామిలీ డాక్టర్

కొమరాడ: మండలంలోని కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి రాజ్యలక్ష్మీపురం గ్రామల్లో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ సీహెచ్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి ఐరన్, ఫోలిక్‌యాసిడ్ మాత్రలు పంపిణీ చేశారు. వైద్య శిబిరానికి రాలేని రోగుల ఇంటి వద్దకు వెళ్లి ఆరోగ్య పరీక్షలు చయడంతో పాటు మందులు అందజేశారు.



వృద్ధురాలికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అరుణ్ కూమార్

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



గరుగుబిల్లి: మాట్లాడుతున్న ఎంఈఓ నాగభూషణరావు

గరుగుబిల్లి: పదోతరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని ఎంఈఓ ఎస్.నాగభూషణరావు అన్నారు. మండలంలోని నాగూరు జెడ్పీ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు ఎలా చదవాలో పదో తరగతి విద్యార్థులకు వివరించారు. పరీక్షలంటే భయం విడిచిపెట్టాలని సూచించారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉత్తీర్ణత సాధించడం కష్టమేమీ కాదన్నారు. ముఖ్యంగా ఆంగ్లం, గణితం, సైన్సు సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

- కురుపాం: పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులు సిద్ధం కావాలని, పిల్లల చదువులపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం తోట శంకరరావు సూచించారు. శనివారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ ఏడాది పాఠశాల నుంచి 84 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. వారంతా ఉత్తీర్ణత సాధించేలా పాఠశాలలో ఉపాధ్యాయులు, ఇంటి వద్ద తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.

రూ.7.80 లక్షలకు మార్కెట్ ఆశీల వేలం ఖరారు

పాలకొండ: నగరపంచాయతీ పరిధిలో మార్కెట్‌లో ఆశీల వసుళ్లకు సంబంధించి వేలం పాటను కమిషనర్ సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. పట్టణానికి చెందిన యిద్దుబోయిన మహేశ్ రూ.7.80 లక్షలకు వేలపాటను దక్కించుకున్నారు. తేదీ 1-4-2023 నుంచి 31-03-2024 వరకు పాటదారు మార్కెట్‌లో ఆశీలు వసూలు చేసుకునేందుకు అర్హత పొందారు. పాట దక్కించుకున్నవారు మూడు విడతల్లో మొత్తం నగదు చెల్లించాలని కమిషన్ తెలిపారు. గతం కంటే 30శాతం ఎక్కువకు పాట వెల్లిందన్నారు. కౌన్సిల్ సమావేశంలో దీన్ని ఆమోదిస్తామన్నారు.



వేలంపాట నిర్వహిస్తున్న కమిషనర్

జీడితోట దగ్ధం

కొమరాడ: మండలంలోని పాలెం పంచాయతీ రావికోన గ్రామానికి చెందిన కిల్లక లక్ష్మి చెందిన సుమారు ఐదు ఎకరాల జీడితోట శుక్రవారం అర్ధరాత్రి అగ్నికి ఆహుతయ్యింది. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతోనే ఈ ప్రమాదం జరిగిందని బాధితురాలు వాపోయింది. చేతికి అందివస్తుందనుకున్న పంట అగ్నికి ఆహుతవ్వడంతో బోరున విలపించింది. దీనిపై అధికారులు దర్యాప్తు చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలకి ఆమె కోరింది.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

వీరఘట్టం: స్థానిక సత్యసాయి సేవా సమితిలో ఈనెల 6న ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు సమితి కన్వీనర్ వూణ్న విశ్వప్రసాద్, ప్రగతి సేవా సొసైటీ అధ్యక్షుడు పైల హరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్, నవజీవన్ తిరుపతి ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వైద్య పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. కంటి వ్యాధులతో బాధపడేవారంతా ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో స్వల్పకాలిక కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టీవీ గిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఎంకేవీవై 4.0 ఆధ్వర్యంలో స్కిల్ హబ్ ఇనీషియేటివ్ కార్యక్రమం ద్వారా ఎలక్ట్రీషియన్, ఫోర్‌వీలర్ సర్వీస్, ప్లంబింగ్, సూయింగ్ మిషన్ ఆపరేటింగ్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. పదో తరగతి పాస్, ఫెయిల్ అయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు 2 పాస్‌ఫోటోలు, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్ కాపీలతో స్కిల్‌హబ్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్న వివరాలకు 6304033963, 9948582309 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జీడిలో సస్యరక్షణ

కొమరాడ: మండలంలోని బంగారమ్మపేటలో రైతులకు జీడితోటల సాగుపై ఐటీడీఏ ప్రాజెక్టు ఉద్యాన అధికారి క్రాంతికుమార్ శనివారం అవగాహన కల్పించారు. జీడితోటలోటీ దోమ నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. టి దోమ నివారణకు ఇమికోపిడ్ 0.5 ఎం.ఎల్, నువాన్ 1 ఎం.ఎల్ ఒక లీటరు కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. సకాలంలో సస్యరక్షణ చేపడితే అధిక ఫలసాయం పొందవచ్చన్నారు.

బొలెరో ఢీకొని వ్యక్తికి గాయాలు

పాలకొండ రూరల్: పాలకొండ–వీరఘట్టం రహదారిలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జి.ఎం.వలస మండలం ఇటుక గ్రామానికి చెందిన అరసాడ అప్పలనాయుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. ఎస్సై బి.శివప్రసాద్ అందించిన వివరాల మేరకు.. బాధితుడు శ్రీకాకుళం జిల్లా వత్సవల యాత్రకు వెళ్లి దైవ దర్శనం చేసుకుని తిరిగి వస్తూ.. స్థానిక కార్గిల్ కూడలిలో టీ తాగేందుకు ఆటో దిగాడు. ఆ సమయంలో వీరఘట్టం నుంచి వస్తున్న బొలెరో వాహనం వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని 108 వాహనంలో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం

భామిని: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌ను, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావును భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, పార్టీ పరిశీలకుడు దోల జగన్మోహనరావు పిలుపునిచ్చారు. మండలంలోని లివిరి, పొందరకాలనీ, బైరికాలనీ, అనంతగిరి తదితర ప్రాంతాల్లో శనివారం స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పట్టభద్రుల ఓటర్లను కలిసి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషిచేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచిన సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సోమరాజు గోపాలరావు, భామిని సొసైటీ చైర్మన్ గెల్లంకి రమేష్, జేసీఎస్ మండల కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, ఎంపీటీసీలు టింగ అన్నాజీరావు, పొట్నూరు ఉషారాణి, బూస బాలకృష్ణ, సర్పంచ్ భౌరి సౌధామిని, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



భామిని: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కళావతి, పార్టీ పరిశీలకుడు దోల జగన్

- పాలకొండ రూరల్: ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులను ఆశీర్వదించాలని ఆ పార్టీ మండల కన్వీనర్, వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్ కోరారు. మండలంలోని వెలగవాడ, రుద్రిపేట తదితర గ్రామాల్లో శనివారం ఎమ్మెల్సీ అభ్యర్థులు సీతంరాజు సుధాకర్, నర్తు రామారావుకు మద్దతుగా ప్రచారం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులను, పట్టభద్రులను కలిసి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నల్లి శివప్రసాద్, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు రణస్థలం రాంబాబు, కోట అజయ్‌కుమార్, నేరళ్ల ప్రసాద్, శింగవలస విజయ్‌కుమార్, సిహెచ్.జగదీష్‌కుమార్, ఎస్.రాజగోపాలం, శేషపు విజయ్ తదితరులున్నారు.



పాలకొండ రూరల్: వెలగవాడలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన నాయకులు

పాలకొండ: గ్లోబల్ ఇన్వెస్టార్స్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు విశాఖ వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఉమ్మడి జిల్లాకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖకు అంతర్జాతీయంగా గుర్తింపు తీసుకువచ్చినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రానికి వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు తీసుకురావడంతో పాటు ఉత్తరాంధ్రా జిల్లాల అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఈ ప్రాంత ప్రజలు రుణపడి ఉంటారన్నారు.

సీఎంను కలిసిన వారిలో మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ తదితరులు ఉన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడి

గరుగుబిల్లి: సస్యరక్షణ చర్యలతోనే వేరుశనగలో అధిక దిగుబడులు సాధించొచ్చని వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ వేరుశనగ పంటలో వేరుకుళ్లు, టిక్కామచ్చ తెగులు గుర్తించామన్నారు. వేరుకుళ్ల నివారణకు బ్లెటైక్స్ 3 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే టిక్కామచ్చ తెగులు నివారణకు మాంకోజెబ్ 3 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పంటలకు తెగుళ్లు సోకినపుడు వ్యవసాయాధికారుల సలహాల మేరకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.



శివ్వాంలో సాగుచేస్తున్న వేరుశనగపంట

ఎన్నికల నిబంధనలు పాటించాలి

గుమ్మలక్ష్మీపురం: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని తహసీల్దార్ జె.రాములమ్మ అన్నారు. శనివారం తన కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ప్రచార సమయంలో, పోలింగ్ రోజున ఎటువంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడకూడదని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు, ఎల్విన్‌పేట పోలీసులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రాములమ్మ

పట్టభద్రులంతా ఓటుహక్కు వినియోగించుకోవాలి

వీరఘట్టం: పట్టభద్రుల ఓటరు జాబితాలో పేరున్న ప్రతి ఒక్కరూ ఈ నెల 13న జరిగే ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకోవాలని తహసీల్దార్ చందక సత్యనారాయణ కోరారు. మండల వ్యాప్తంగా జరుగుతున్న ఓటరు స్లిప్పుల పంపిణీపై శనివారం ఆయన ఆరా తీశారు. బీఎల్ఓలు మాత్రమే ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న 1319 మంది పట్టభద్రులకు ఓటరు స్లిప్పులు పంపిణీ చేసినట్లు చెప్పారు. వీరఘట్టం బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు.



తూడిలో వైస్ ఎంపీపీ పర్రి విజయకుమారికి ఓటరు స్లిప్పు అందజేస్తున్న బీఎల్ఓ

నష్టపోయిన ప్రతీ రైతుకు పరిహారం అందజేస్తాం

వీరఘట్టం: ఏనుగుల సంచారంతో పంటలు నష్టపోయిన ప్రతీ రైతుకు పరిహారం అందజేస్తామని తహసీల్దార్ చందక సత్యనారాయణ అన్నారు. శనివారం కిమ్మి గ్రామంలో ఫారెస్టు అధికారులతో కలిసి రైతులతో సమావేశం నిర్వహించారు. రైతుల సహకారంతో రెవెన్యూ, ఫారెస్టు అధికారుల సమన్వయంతో పంట నష్టాలను పరిశీలిస్తామన్నారు. ఈ నివేదికను అటవీశాఖ అధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదించి పరిహారం అందేలా చేస్తామన్నారు. డీఆర్ఓ రవిబాబు మాట్లాడుతూ ప్రస్తుతం కిమ్మి–నడుకూరు సమీప పంట పొలాల్లో తిష్ట వేసిన ఏనుగుల్లో ఒక ఏనుగు ప్రసవించిందని, కాబట్టి ప్రజలు, రైతులు వాటి సమీపంలోకి వెళ్లొద్దని కోరారు. వాటి దగ్గరకు వెళ్లడం, సెల్ఫీలు తీసుకోవడం వంటి రెచ్చగొట్టే పనులతో అవి భయాందోళనకు గురై దాడి చేసే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించాలని కోరారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ, పక్కన డీఆర్ఓ రవిబాబు

సర్కారు బడులను ప్రగతిపథంలో నిలపాలి

- డిప్యూటీ విద్యాశాఖ అధికారి విజయకుమారి

వీరఘట్టం: సర్కారు బడులను ప్రగతి పథంలో నిలపాలని పాలకొండ ఉప విద్యాశాఖ అధికారి ఆర్.విజయకుమారి సూచించారు. శనివారం మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలలో తనిఖీలు చేపట్టారు. రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా పలు పాఠశాలలు తనిఖీ చేయగా, కొన్ని లోపాలు కనిపించాయని, ఆ లోపాలను సరిచేసుకోవాలని ఇదివరకు అన్ని పాఠశాలలకు సూచించడం జరిగిందన్నారు. ఎంతవరకు వాటిని సరిచేసుకున్నారో పరిశీలించేందుకే అన్ని పాఠశాలలను ఏక కాలంలో తనిఖీ చేయడం జరిగిందన్నారు. వీరఘట్టం మండలంలోని హైస్కూల్ హెచ్ఎంలు 9 బృందాలుగా ఏర్పడి, ఒక్కో బృందం 5 పాఠశాలలను తనిఖీ చేసినట్లు చెప్పారు. ముఖ్యంగా బైజూస్ యాప్ వినియోగం, విద్యార్థుల వర్క్ బుక్స్, నోట్ బుక్స్‌తో పాటు ఉపాధ్యాయుల లెసన్ ప్లాను, టీచింగ్ ప్లాను, టీచర్ డైరీలను పరిశీలించడం జరిగిందన్నారు. ఇంకా కొన్ని పాఠశాలల్లో చిన్నచిన్న లోపాలు ఉన్నాయని, వాటిని సరిచేసుకోవాలని సూచించినట్లు చెప్పారు.



రేగులపాడు కేజీబీవీలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఉప విద్యాశాఖ అధికారి విజయకుమారి

మహిళలు చైతన్యవంతులు కావాలి

పాలకొండ రూరల్: నేటి సమాజంలో మహిళలు చైతన్యంతో మెలగాలని ఐద్వా నాయకురాలు గోరు పద్మ అన్నారు. మండలంలోని బుక్కా గ్రామంలో శనివారం అంగన్‌వాడీ, సచివాలయ మహిళా పోలీస్, క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది సమన్వయంతో స్థానిక మహిళలతో సమావేశం నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో భాగంగా మహిళల రక్షణకు నిర్దేశించిన చట్టాలపై వారికి అవగాహన కల్పించారు. సమాజంలో స్త్రీలు, ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు మహిళలు ధైర్యంగా ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎస్.హిమప్రభ, బి.అమరవేణి, ఎ.పద్మ, బి.జయంతి, ఎస్.కమలాజోష్, టి.దివ్య, పి.రామలక్ష్మి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐద్వా నాయకులు